

''ఊష్టింగా....ఉఊః అవుష్టింగ్ అవుష్టింగ్:''
వారు వెంటనే నా ఉచ్చారణను దిద్దిరి.
అవును వారు తెలుగైనను, ఆంగ్లమైనను ఉచ్ఛారణ
విషయమున గట్టిపట్టుదల గలవారు.

# జ్ఞాపకాలు


## డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

ఆంధ్రోపన్యాసకుడు, జె.కె.సి. కళాశాల, గుంటూరు


1971లో....

నేను రోశయ్యగారి గృహమున కేగితిని.

''ఊష్టింగ్ ఆర్డర్ వచ్చిందండీ....మీకు చెబుదామనీ....;'' మాటలు తడబడుచుండ మనవి చేసితిని.

అవును, ఆయన సింహస్వప్నము. ఆయన యెదట నిలచి మాటలాడు ధైర్యము మాలో నెందఱకు గలదు?

''ఊష్టింగా....ఉఊః అవుష్టింగ్ అవుష్టింగ్:'' వారు వెంటనే నా ఉచ్చారణను దిద్దిరి.

అవును వారు తెలుగైనను, ఆంగ్లమైనను ఉచ్చారణ విషయమున గట్టిపట్టుదల గలవారు.

ఇట్టి యనుభవములు మాలో నెందఱకో గలవు . భారతిలో 'బనగానపల్లెలో బ్రహ్మముగారు' అను వ్యాసము వ్రాసితిని.

సంతకము పెట్టుటకా దినము రోశయ్యగారి గదిలోకి వెడలితిని.

''ఊఁ! చదివా చదివా!!'' వారు చిరునవ్వుతో నాతోననిరి.

వారు నా వ్యాసమును చదివిరన్న యానందమొక వైపు, ఏమి తప్పులు పట్టిరోయన్న భయమొకవైపు:

''చింతయిత్తు అని వ్రాశావేమిటీ?'' అని ప్రశ్న. నేను తప్పుతెలిసికొని తలగోకికొంటిని. తరువాత గ్రంథాలయమునఁ జూడగా భారతిలోని నా వ్యాసమున ఎఱ్ఱపెనిసిలితో క్రీగీత యున్నది.

ఆయన ప్రతి పత్రికను ప్రత్యక్షరమును పరిశీలించెడివారు. తప్పులున్న గుర్తులు పెట్టెడివారు. అది యెంత యుపయుక్తమో నాకా తరువాత బాగుగా తెలిసినది. వ్యవహారికములో నుండు దినపత్రికలలోను ఇట్టి గీతలుండెడివి. వ్యావహారికమైనను నొక పద్ధతిలో నుండవలయును గదా; ఇచ్ఛవచ్చినరీతిలో వ్రాయుటనువారు సహించెడివారు గాదు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎక్జామినేషన్స్ జరుగుచున్నవి. ఆ దినము తెలుగు పరీక్ష. పరీక్షయైనపిదప పత్రములను అప్పగించుటకు రోశయ్యగారి గదివద్దకేగితిని. వారు సైగజేసి దగ్గరకుబిలిచిరి. తెలుగు ప్రశ్న పత్రమును దీసిరి.

నాకు గుండె గుభిల్లుమనినది.

నన్ను ప్రశ్నింపదొడగిరి. అదృష్టవశమున ఆ పరీక్షలో నెగ్గితిని. వారు నవ్వుచు నన్ను సాగనంపిరి. బతుకు జీవుడా యనుచు బయట పడితిని.

ఇట్టి పరీక్షలు మా సహచరులకు సామాన్యమే; వారి దెబ్బ దట్టుకొనలేక బాలవ్యాకరణమును జదివి పండితులైన వారును మాలోలేకపోలేదు.

జాషువా సంస్మరణ సభలు బి.ఎడ్. కళాశాలలో జరిగినవి. ఒక దినము రోశయ్య గారధ్యక్షుడు. ఉపన్యాసకుడు వ్యావహారిక భాషావాది.

ఉపన్యాసకుడు కేవలము జాషువా కవిత్వమును గూర్చియేగాక, వ్యావహారిక భాషా విషయమును గూర్చి గూడ ముచ్చటించిరి. ఉపన్యాసానంతరము అధ్యక్షుడు మలి పలుకులు పలకవలెను. రోశయ్యగారు లేచిరి. వ్యావహారిక భాషా వాదమును చీల్చిచెండాడిరి. అట్టి యుపన్యాసమును నేనెన్నడును వినియుండలేదు. రోశయ్య గారానాడు విశ్వరూపమును ప్రదర్శించిరి. ఉపన్యాసకుడు ముప్పావు గంట యుపన్యాసమీయగా నధ్యక్షుడు రెండు గంటలుపన్యసించిరి. అది మిగుల రసవత్తరముగను, విజ్ఞాన దాయకముగనునున్నది. ఆ యుపన్యాసమును విన్నవారు నిజముగా నదృష్టవంతులు.



అమెరికా పర్యటనలో...